రెండు ఆలయాల్లో చోరీ

ఎదులాపురం, జూలై 30 : ఆదిలాబాద్‌లోని రాంనగర్‌లోని కోదండ రామాలయం, పోచమ్మ ఆలయాల్లో సోమవారం అర్ధ రాత్రి దాటిన తర్వాత దొంగతనం జరిగింది. ఉదయం ఆలయాలకు వచ్చి చూసిన పూజారులకు హుండీ పగుల గొట్టి కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కోదండ రామాలయంలో వేకువజామున ఈ చోరీ ఘటనలు జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఘటనలపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఆలయంలో వరుసగా రెండోసారి చోరీ జరిగిందని కోదండ రామాలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

గుడిహత్నూర్, జూలై 30 : గుడిహత్నూర్ మండలం గురుజ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి విద్యుత్ షాక్‌కు గురై మంగళవారం మృతి చెందాడు. సంఘటన వివరాలు ... గురుజ గ్రామానికి చెందిన కార్తీక్ (17) తన బావ వ్యవసాయ పొలానికి వెళ్లాడు. నీళ్లు పట్టడానికి కరెంట్ మోటారు స్టార్ట్ చేయడానికి ప్రయత్నించగా కరెంట్ సరఫరా కాపోవడంతో కరెంట్ వైర్లను వదిలించే ప్రయత్నం చేయగా సర్వీస్ వైరు ప్రక్కనే ఉన్న ఫెన్సింగ్ వైరుపై పడింది. ఆ యువకుడు ఆ ఫెన్సింగ్ వైరుకు అనుకొని ఉండడంతో విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడని స్థానికులు తెలిపారు. ఇటీవల కార్తీక్ పదో తరగతి పూర్తి చేసుకున్నాడు. ఈ ఘటనతో మృతుని కుటుంబంలో విషాదం నెలకొంది.

పిచ్చికుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలు

బజార్‌హత్నూర్, జూలై 30: మండల కేంద్రంలో మంగళవారం ఇద్దరు చిన్నారులపై పిచ్చికుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చిన్నారులను దవాఖానకు తరలించారు. అధికారులు, పాలకులు చర్యలు తీసుకొని పిచ్చికుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పోగొట్టుకున్న నగదు అందజేత

సోన్, జూలై 30 : సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు మంగళవారం ఉదయం తన ఇంటి నుంచి ద్విచక్రవాహనంలో రూ. లక్ష నగదును వెంట పెట్టుకొని సమీపంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో చెల్లించేందుకు వెళ్తున్నాడు. అయితే పొరపాటున ఆ నగదు జాతీయ రహదారి 44పై పడిపోయింది. బ్యాంకుకు వెళ్లిన శ్రీకాంత్‌కు నగదు కవరు కనిపించకపోవడంతో వెంటనే రోడ్డు వెంబడి చూసుకుంటూ వస్తున్నాడు. వెనుక ఉన్న నిజామాబాద్ జిల్లా సోన్‌పేట్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు ఆ నగదు కవరు దొరకడంతో అందులో తెరిచి చూడగా రూ.లక్షతో పాటు బ్యాంకు ఖాతా పుస్తకం ఉండడంతో వాటి వివరాల ప్రకారం శ్రీకాంత్‌కు అప్పగించారు. దీంతో పోగొట్టుకున్న నగదు పోయిందనుకున్న శ్రీకాంత్‌కు తిరిగి ఇచ్చేయడంతో సంతోషం వ్యక్తం చేశాడు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఎదులాపురం, జూలై 30 : ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమేశ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ నాయకులు ఉన్నారు.

రేపటి నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

ఎదులాపురం, జూలై 30 : టీజీ డీసెట్ 2024లో ర్యాంక్ సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అభ్యర్థులకు రెండు సంవత్సరాల (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్), (డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్) ప్రవేశానికి ఆగస్టు 1వ తేదీ నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు కేటాయించిన తేదీలలో హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే జాదవ్ అనిల్ చర్చపై రైతుల హర్షం

భీంపూర్, జూలై 30 : భీంపూర్ మండలం పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపు , భూనిర్వాసితులకు పునరావాసం కల్పించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. దీంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే కొత్త మండలం భీంపూర్‌లో కార్యాలయ పక్కా భవనాల ఏర్పాటు గురించి ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆగస్టు 18 వరకు ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలు

భైంసా, జూలై 30 : 2024– 25 విద్యాసంవత్సరానికి గాను గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఓపెన్ యూనివర్సిటీ) లో డిగ్రీలో చేరుటకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, ఈ ప్రవేశాలు ఆగస్టు 18 వరకు కొనసాగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, కోఆర్డినేటర్ మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థిని, విద్యార్థులు మీసేవ కేంద్రంలో www.braou అనే పోర్టల్ ద్వారా ప్రవేశాలు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382929740 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

3లోగా పశువులను విడిపించుకోవాలి

బోథ్, జూలై 30 : బోథ్ గ్రామ పంచాయతీ పరిధిలోని రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను మంగళవారం పంచాయతీ బంజరదొడ్డిలో వేయడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పశు యజమానులు వాటిని ఆగస్టు 3వ తేదీలోగా ఒక్కొక్కటికి రోజువారి అపరాధ రుసుము రూ.వెయ్యి చెల్లించి విడిపించుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఆగస్టు 5వ తేదీన పశువులకు వేలం ప్రకటన జారీ చేసి గోశాలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. తదుపరి ఎలాంటి ఆక్షేపణలు ఉండవని తెలిపారు.

కిషన్ మహారాజ్ సేవలు మరువలేనివి

ఉట్నూర్, జూలై 30 : కిషన్ మహారాజ్ సేవలు మరువలేనివని దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ అన్నారు. ఉట్నూర్‌లో మంగళవారం నిర్వహించిన తెర్వి(పెద్దకర్మ) కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో బానోత్ ఆత్మారాం, బానోత్ గజానంద్‌నాయక్, సురేశ్, జాదవ్ సుమన్‌బాయి, హరినాయక్, స్వామి, దేవీదాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మరింత పౌష్టికాహారం

తాంసి, జూలై 30: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్థానిక కమ్యూనిటీ సహకారంతో మరింత పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వ తిథి(సామూహిక) భోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కప్పర్ల మాజీ ఎంపీటీసీ కౌడాల సంతోష్, మాజీ సర్పంచ్ కౌడాల నారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని కప్పర్ల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్థానిక యువ నాయకులు గండ్రత్ అరుణ్ తనవంతుగా రూ.5వేలు అందజేసి తిథి(సామూహిక) భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో యువ నాయకులు గండ్రత్ అరుణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్, ఉపాధ్యాయులు కిష్టన్న, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

- ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

ఎదులాపురం: దోమల లార్వాను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో, జిల్లా మలేరియాఅధికారి

ఎదులాపురం, జూలై 30 : డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో డెంగీ కేసు నమోదు కావడంతో అక్కడ స్ప్రే చేయించారు. చుట్టు పక్కల 50 ఇండ్లలో స్ప్రే చేయించి పరిసరాలు పరిశుభ్రం చేయించారు. వైద్యులు వారిని పరీక్షించి పలు సూచనలు చేశారు. డీఎంహెచ్‌వోతో పాటు జిల్లా మలేరియా అధికారి ఎం శ్రీధర్ కాలనీ సందర్శించి బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ దోమలు వృద్ధికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌యూవో రఘునాథ్, హెల్త్ సూపర్‌వైజర్ సురేశ్, వీబీడీ కన్సల్టెంట్ సబనాజ్, సిబ్బంది అనిల్, అరుణ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తానూర్, జూలై 30 : బెల్గాం గ్రామంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పలు ఇండ్ల ఆవరణలు, పెరడులను ఎంపీడీవో మోహన్‌సింగ్, జేపీఎస్ కమల్‌సింగ్, సిబ్బంది పరిశీలించారు. వివిధ రకాల మట్టి పాత్రలు, టైర్లు, వాడకంలో లేని వంటపాత్రల్లో నిల్వ ఉన్న నీటిలో లార్వాను గుర్తించి దానిపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్, మల్టీపర్పస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య పరీక్షలు

భీంపూర్, జూలై 30 : గుబిడి, నింగూడ గ్రామాల్లో భీంపూర్ పీహెచ్‌సీ, ఉపకేంద్రాల సిబ్బంది మంగళవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 105 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరాల్లో వైద్యాధికారి నిఖిల్‌రాజ్, మాజీ సర్పంచ్‌లు ప్రతాప్, కృష్ణ, హెచ్ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బేల, జూలై 30: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి జోగు ప్రణయ సూచించారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా డోప్టాల గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఆశకార్యకర్త కవిత, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఇంద్రవెల్లి, జూలై 30 : పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మికాంతామణి అన్నారు. సట్వాజీగూడ సబ్‌సెంటర్ ఆధ్వర్యంలో మర్కాగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బర్సన్‌పటార్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. 35 మంది గర్భిణులతో పాటు చిన్నపాటి జ్వరంతో ఉన్న రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఇంటింటికీ తిరిగి నిల్వ ఉన్న నీటిని పారబోశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమిద్దాం

ఖానాపూర్ టౌన్, జూలై 30 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఆందోళనలు చేస్తామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో ఆందోళనకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాక కాంగ్రెస్ ప్రభుత్వం దాటవేస్తోందన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 1న అన్ని మండలాల తహసీల్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంకుశ్‌రావు, జక్కుల రాజన్న, ఎల్లయ్య, శంకర్, రాజన్న, మధు,శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

ఇంద్రవెల్లి, జూలై 30 : ముత్నూర్, వడగాం సెక్టర్ పరిధిలో మహిళా సాధికారత, మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు మహిళా రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలనతో పాటు వరకట్నం, బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిక్లేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజులత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో విడుత రుణమాఫీపై వీడియో కాన్ఫరెన్స్

బోథ్ : వీసీలో పాల్గొన్న అధికారులు, నాయకులు, రైతులు

బోథ్, జూలై 30 : రెండో విడుత రుణమాఫీపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి సీఎంతో పాటు మంత్రులు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వీసీలో రైతు వేదికల వారీగా రుణమాఫీపై రైతులతో నేరుగా మాట్లాడారు. రూ.1.50 లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్, ఎంపీడీవో రమేశ్, ఏఈవోలు, నాయకులు బద్ధం పోతారెడ్డి, ఇట్టెడి రాజు, అరుణ్ రెడ్డి, అబుద్, క్రాంతి, రైతులు పాల్గొన్నారు.

ఇచ్చోడ, జూలై 30 : ఇచ్చోడ, సిరికొండ మండలాల్లోని రైతు వేదికల్లో రెండో విడుత రైతు రుణమాఫీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ఏడీ రాంకిషన్, ఏవో జాదవ్ కైలాస్, ఏఈవో దీపక్, ప్రవీణ్, రోహిణి, అనుదీప్, సంధ్య, సాయిరాం పాల్గొన్నారు.

తలమడుగు, జూలై 30 : భరంపూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఏఈవోలు , సొసైటీ డైరెక్టర్ ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

ముథోల్, జూలై 30 : ముథోల్‌లోని రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని రైతులు వీక్షించారు. రుణమాఫీ చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. సమావేశంలో ఏఈవో ప్రవీణ్, ఏవో భాస్కర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, జూలై 30 : రాష్ట్ర ప్రభుత్వం రెండో విడుత రుణమాఫీ విడుదల చేసింది. మండలంలోని శ్యాంపూర్ గ్రామంలోని రైతు వేదికలో సీఎం సందేశాన్ని రైతులు తిలకించారు. మొదటి విడుతలో లక్ష వరకు ఉన్న 1546 మంది రైతులకు రుణమాఫీ చేయగా రెండో విడుత లక్షా యాభై వేల లోపు ఉన్న 1486 మందికి రుణమాఫీ కానున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు వినయ్ కుమార్, జయశ్రీ, దేవేందర్, సుధాకర్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

జైనథ్, జూలై 30 : మండల కేంద్రంలోని రైతువేదికలో రెండో విడుత రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు మండల రైతులు పాల్గొన్నారు. రైతు రుణమాఫీ, పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వై సాంబశివరావ్, ఎంపీడీవో రవీంద్రనాథ్, రైతులు, ఏఈవోలు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ప్రాణాధారం

తానూర్, జూలై 30 : మానవ మనుగడకు మొక్కలే ప్రాణాధారమని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని హంగిర్గా, దౌలతబాద్ గ్రామాలను సందర్శించారు. పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ సమద్, ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మణ్, సాయినాథ్, వ్యవసాయ విస్తరణాధికారి పవన్‌కుమార్ ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం

ఖానాపూర్ , జూలై 30 : ఖానాపూర్ మున్సిపాలిటీలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఉద్యోగుల సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న బిల్ కలెక్టర్ బోజారాం, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభయహస్తం హామీ అమలు చేయాలి

భీంపూర్, జూలై 30 : ఆర్థికంగా , సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ గా మార్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ కోరారు. భీంపూర్‌లో సంఘం నాయకులతో కలిసి మంగళవారం తహసీల్దార్ నారాయణరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన వెంట మండల మాజీ వైస్ ప్రెసిడెంట్ గడ్డం లస్మన్న , మాజీ ఉపసర్పంచ్ దొంతుల సుభాష్, సంఘ నాయకులు కిష్టయ్య, రామన్న ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ముందస్తు అరెస్ట్

ఇంద్రవెల్లి, జూలై 30: సీఐటీయూ, ఆశ కార్యకర్తల సంఘం రాష్ట్ర పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని హెల్త్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న మండల ఆశ కార్యకర్తలను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఆశ కార్యకర్తల సంఘం మండలాధ్యక్షురాలు సిడాం కాంతబాయి మాట్లాడుతూ తమకు చెందిన 24 డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిచో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఆశకార్యకర్తల సంఘం సభ్యులు వనమాల, దురపత, సోను. గోదావరి, తులసి, సంగీత, సుమిత్ర, మహినిబాయి పాల్గొన్నారు.

దస్తురాబాద్, జూలై 30 : న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్కులో ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న కారోబార్లు, పంచాయతీ కార్మికులు, ఆశ కార్యకర్తలను మంగళవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అలాగే ఇంటి వద్ద సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్‌ను సైతం అరెస్టు చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేయడం సరికాదు అని వారు అన్నారు. ఇక్కడ హెడ్‌కానిస్టేబుల్ ద్వైకర్, సిబ్బంది ఉన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన పంద్రం శంకర్

బోథ్, జూలై 30 : ఆదిలాబాద్‌లోని జిల్లా జడ్జి కే ప్రభాకర్ రావ్‌ను మంగళవారం బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పంద్రం శంకర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలు అంశాలపై చర్చించారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

తలమడుగు, జూలై 30: పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్షలకు సిద్ధం కావాలని, వందశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ప్రణీత సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన తిథి భోజనం కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించారు. అనంతరం తరగతి గదిని సందర్శించిన విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రావ్, సెక్టోరల్ అధికారి శ్రీకాంత్ గౌడ్, కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణకుమారి, ప్రత్యూష, శంకర్, నగేశ్, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం తనిఖీ

బాసర, జూలై 30 : బాసర గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం డీఎల్‌పీవో బానోత్ సుదర్శన్ పటేల్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారసంత వేలం పాట నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి గోవింద్‌రాజును ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో గంగాసింగ్, పంచాయతీ బిల్ కలెక్టర్ వంశీసాయి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ఎదులాపురం, జూలై 30 : కామారెడ్డిలో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగే శోభ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్ ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేపట్టారు. బీసీ డిక్లరేషన్ పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, లాలామున్న, పాయల్ శరత్, మహేందర్, దయాకర్, దత్త నిక్కం పాల్గొన్నారు.

చెట్లు నరికివేత కేసులో ఇద్దరికి రిమాండ్

సారంగాపూర్, జూలై 30 : చెట్లు నరికివేత కేసులో మండలంలోని జెవులి గ్రామానికి చెందిన బండరి సాయన్న, కొత్తపాటి చిన్న గంగన్నను రిమాండ్‌కు పంపినట్లు డీఆర్వో శ్రీదేవి మంగళవారం తెలిపారు. ఈ నెల 28న ప్లాంటేషన్‌లో చెట్లు నరికివేస్తున్నారని తెలియడంతో ఫారెస్టు అధికారులు వెళ్లగా వారిని చూసి పరారయ్యారని తెలిపారు. పోలీసుల సాయంతో పట్టుకున్నామని, 96 చెట్లు నరికివేసినందుకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆమె వెంట ఎఫ్‌బీవోలు వెన్నెల, స్వప్న, రాజాసింధు పాల్గొన్నారు.

ముగిసిన ప్రమాద రహిత వారోత్సవాలు

నిర్మల్ చైన్‌గేట్, జూలై, 30 : ఆర్టీసీలో 24 నుంచి 30 వరకు నిర్వహించిన ప్రమాదరహిత వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆదిలాబాద్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో సర్వీసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లను రీజినల్ మేనేజర్ సొలోమన్ శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇందులో నిర్మల్ డిపోకు చెందిన అమర్‌సింగ్, మినజొద్దీన్, సీబీరావు, నర్సయ్య, పరమేశ్వర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

సారంగాపూర్, జూలై 30 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, కేసుల వివరాలను పరిశీలించారు. డయల్ 100 సేవలు, పెట్రోలింగ్, నేరాల ఛేదన, సీసీ కెమెరాలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ వసంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వరల్డ్ విజన్ చేయూత

లక్ష్మణచాంద, జూలై 30 : లక్ష్మణచాందలో మంగళవారం వరల్డ్ విజన్ ఇండియా నిర్మల్ ఏపీడీ ఆధ్వర్యంలో 24 మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు ఆహారపు బుట్టలను సీడీపీవో నాగమణి అందించారు. 6 నెలల పాటు అందిస్తామని ప్రాజెక్టు మేనేజర్ బ్రహ్మన్న తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాథోడ్ రాధ, సఖీ మేనేజర్ సవిత, సిబ్బంది జ్యోతి, శైలజ, మౌనిక, వరల్డ్ విజన్ కో–ఆర్డినేటర్ కరుణాకుమార్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

బోథ్, జూలై 30 : పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టిన మౌన దీక్షలో బోథ్ ప్రాంత విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్ సుధాకర్, ఎం రాజేశ్వర్ రెడ్డి, దివాకర్ రెడ్డి, గణపతి, గోవర్ధన్, ప్రేమ్‌సింగ్, గంగాధర్, ఆనందం పాల్గొన్నారు.

రైతులను గందోరగోళానికి గురి చేస్తున్న ప్రభుత్వం

తలమడుగు, జూలై 30 : రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి సీఎం రేవంత్ రెడ్డి రైతులను గందోరగోళానికి గురి చేస్తున్నారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని సాయిలింగి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడుతలో రూ. 85 వేలు తీసుకున్న రైతు ఖాతాలో రూ.52 వేలు మాత్రమే జమ అయ్యాయన్నారు. రైతులు వ్యవసాయ పనులు చేసుకోవాల్సిన సమయంలో పాసు పుస్తకాలు పట్టుకొని బ్యాంకుల చుట్టు తిరుగుతున్నారన్నారు. బ్యాంకుల్లో అధికారులు సరైన సమాచారం అందించక రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రైతులకు ఒకేసారి రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విడుతల వారీగా రుణమాఫీ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ పొచ్చన్న, యువజన నాయకులు తోట ప్రమోద్, రమాకాంత్, తోట శ్రీనివాస్, చందు, రాంకిషన్ పాల్గొన్నారు.

సమస్త జీవకోటికి చెట్లే ఆధారం

ఇంద్రవెల్లి: మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు, నాయకులు

ఇంద్రవెల్లి, జూలై 30 : సమస్త జీవకోటికి చెట్లే ఆధారమని మండల ఎఫ్ఆర్వో సంతోష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఎదుట వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో బయోడైవర్సిటీ బోర్డు జిల్లా కోఆర్డినేటర్ సోన్‌కాంబ్లే గోపీనాథ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, జిల్లా నాయకులు సోన్‌కాంబ్లే జితేందర్, ఎండీ జునైద్, ఎఫ్ఎస్‌వోలు రాజేందర్, నర్సయ్య, ఎఫ్‌బీవోలు రాజు, సునీల్, అరుణ్, సుజాత, సిబ్బంది సంజీవ్, మారుతి పాల్గొన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

ఉట్నూర్, జూలై 30 : మొక్కల పెంపకం సామాజిక బాధ్యత అని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ అన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సిబ్బందితో కలిసి మొక్క నాటారు. కార్యక్రమంలో డీఈ జాదవ్ సుభాష్, ఏఈ రోహిదాస్, కాంట్రాక్టర్ డివిజన్ అధ్యక్షుడు జాదవ్ ప్రకాశ్, రాథోడ్ రాహుల్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నిర్మల్ అర్బన్, జూలై 30 : నిర్మల్‌లోని దత్తాత్రేయ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన కాలనీ వాసులతో కలిసి వార్డులో పర్యటించి సమస్యలు పరిశీలించారు. కాలనీ వాసులు సైతం రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ఖాళీప్లాట్లలో నీరు నిలిచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలోనే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గంగారెడ్డి, కాలనీ వాసులు వెంకటేశ్వర్ రావు, రవీందర్ రెడ్డి, రాంచందర్ రెడ్డి, ప్రేమనాథ్ రావు, వెంకటరమణ, నర్సారెడ్డి, కిషన్‌రావు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు కృషి చేయాలి

నిర్మల్ అర్బన్, జూలై 30 : నిర్మల్ మండలం ద్యాంగాపూర్ గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులు మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావును క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పెద్దమ్మ తల్లి ఆలయానికి దేవాదాయ శాఖ ద్వారా నిధుల మంజూరుకు కృషి చేయాలని వినతిపత్రం ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఇక్కడ సభ్యులు ఉమామహేశ్వర్, సంతోష్, అశోక్, సాయన్న, నారాయణ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఎదులాపురం: కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీమంత్రి

ఎదులాపురం, జూలై 30 : ఆదిలాబాద్‌లోని గాంధీనగర్‌కు చెందిన కిష్ట ఇటీవల తను చాలించిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న అతని స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్ కొండ గణేశ్, దమ్మపాల్, సంజయ్, నల్ల మహేందర్ ఉన్నారు.

ఉట్నూర్ రూరల్, జూలై 30 : లక్కారం గ్రామానికి చెందిన నాయిబ్రాహ్మణ సంఘం నాయకుడు గర్శకుర్తి చంద్రయ్య ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ పరామర్శించారు. ఆయన వెంట రమేశ్, స్వామి, మతిన్, కృష్ణ ఉన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

ఎదులాపురం, జూలై 30 : ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బండారి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో చలో ఢిల్లీకి సంబంధించిన కరపత్రాలు సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వంగపల్లి దీక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో హాజరుకావాలన్నారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు బొజ్జ ఆడెల్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఉపాధ్యక్షుడు విఠల్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

దిలావర్‌పూర్, జూలై 30 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీవో గోవర్ధన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు వంట చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారికి కావాల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ ఈవో చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

దళితుడిపై దాడి చేసిన ఎఫ్‌బీవోపై చర్యలు తీసుకోండి

పెంబి, జూలై 30 : మృతదేహాన్ని దహనం చేయడానికి పెంబి అడవిలో కట్టెలు సేకరిస్తుండగా దళితుడిపై దాడి చేసిన ఎఫ్‌బీవో ఆశీష్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు మంచికంటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బాధితుడితో కలిసి విలేకరులతో మాట్లాడారు. పెంబిలో ఒకరు మృతి చెందగా దహన సంస్కారానికి గ్రామ శివారులోని అడవిలో కట్టెలు సేకరిస్తుండగా ఎఫ్‌బీవో ఆశీష్ దళితుడైనా అందె నడ్పి రాజన్నను ఇష్టారాజ్యంగా దుషిస్తూ దాడి చేశాడని బాధితుడు వాపోయారు. ఎఫ్‌బీవోపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఇంద్రవెల్లి, జూలై 30 : భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్, రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని రాష్ట్ర కృష్ణ మందిరంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజలింగు, మాజీ ఎంపీపీ తుకారాం, నాయకులు రాజేశ్వర్, హనుమంత్‌రావ్, తుకారాం, రాథోడ్ భీంరావ్, రాజ్‌వర్ధన్, మారుతి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

ఉట్నూర్, జూలై 30 : స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగి బ్రహ్మానందం అన్నారు. మంగళవారం ఉట్నూర్‌లో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అంతకుముందు మాజీ పార్లమెంట్ సభ్యుడు రాథోడ్ రమేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు రితేశ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు సమాంతరంగా విద్య

నిర్మల్ చైన్‌గేట్, జూలై 30 : ప్రభుత్వ పాఠశాలలకు సమాంతరంగా విద్యను అందిస్తున్నామని ప్రైవేట్ పాఠశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ అన్నారు. మంగళవారం నిర్మల్‌లోని బచ్‌పన్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల కన్నా ఉన్నతమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఎంతోమంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌రావు, కోశాధికారి రాఘవేంద్రరావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి శ్యాంసుందర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ఎదులాపురం, జూలై 30 : ఆదిలాబాద్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్‌లో లోన్ ఆఫీసర్, బీఎం, టెక్నికల్ మేనేజర్ పోస్టుల కోసం నిర్వహించిన జాబ్‌మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారి మిల్కా, స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ కార్యాలయ సిబ్బంది గోవర్ధన్, స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

లంబాడ జేఏసీకి ఆదివాసీ సంక్షేమ పరిషత్ సవాల్

నార్నూర్, జూలై 30 : లంబాడాలు ఎస్టీలుగా రాజ్యాంగబద్ధమైన ఏ చట్టంలో ఉన్నారో నిరూపించాలని రాయిసెంటర్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావ్ లంబాడ జేఏసీకి సవాల్ చేశారు. మంగళవారం నార్నూర్‌లోని కుమ్రం భీం కాంప్లెక్స్‌లోని కుమ్రం భీం విగ్రహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు..లంబాడాలు ఆదివాసీ హక్కులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడ జేఏసీ నాయకుల ప్రకటనను ఖండిస్తున్నామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే లంబాడాలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేసి, ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఇస్రూ, ప్రధాన కార్యదర్శి గోవింద్‌రావ్, గౌరవాధ్యక్షుడు రాము, గంగారాం పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

ఉట్నూర్, జూలై 30 : ఉట్నూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో రాంప్రసాద్‌ను మంగళవారం మాజీ ఎంపీపీ జైవంత్‌రావ్, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కోల సత్య, మాజీ ఎంపీటీసీ మనోహర్, వైట్ యూత్ అధ్యక్షుడు సాజీద్ పాల్గొన్నారు.